ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విజ్ఞానానికి సాంకేతికత తోడైతే..

వైద్య రంగంలో మరిన్ని విప్లవాలు

◆ ఎయిమ్స్‌కు ధీటుగా కెజిహెచ్ అభివృద్ధి ◆ స్వర్ణాంధ్ర సాధనలో విశాఖ గేమ్ ఛేంజర్

◆ ఆంధ్రా మెడికల్ కళాశాల సెంటినరీ భవన ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార విలేకరులు

విజ్ఞానానికి సాంకేతికత తోడైతే వైద్య రంగంలో మరిన్ని విప్లవాలు సాధ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన విశాఖపట్నమే స్వర్ణాంధ్ర సాధనలో గేమ్ ఛేంజర్‌గా నిలువనుందని పేర్కొన్నారు. రెండు మూడేళ్లలో విశాఖపట్నంలో పెను మార్పులు సంతరించుకోనున్నాయన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు దాదాపు పూర్తయ్యిందని, అతి త్వరలోనే మెట్రో వస్తుందని, నిర్ణీత కాలంలోనే పూర్తవుతుందని తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాల సెంటినరీ భవన ప్రారంభోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన రాష్ట్ర భవిష్యత్తు, సాంకేతిక విప్లవం వంటి అంశాలపై మాట్లాడారు. తొలుత రూ.50 కోట్లతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని, పైలాన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంబేద్కర్ ఆడిటోరియంను, డిజిటల్ లైబ్రరీ, విజ్ఞాన పరిశోధనా కేంద్రాలను రిమోట్ సాయంతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భవన సముదాయంలోని అన్ని విభాగాలను

ఫొటో గ్యాలరీని ఆసక్తిగా తిలకిస్తున్న చంద్రబాబు

పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో పలు అంశాలపై మాట్లాడారు. అందరూ జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదుద్దేశంతో ఉండటం వల్ల ఆంధ్రా మెడికల్ కళాశాలలో అద్భుతమైన సెంటినరీ కట్టడం అందుబాటులోకి వచ్చిందన్నారు. దేశంలోనే అత్యంత పురాతన కళాశాల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఒకటి కావటం విశేషమన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎయిమ్స్‌కు ధీటుగా కెజిహెచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయమై ఇప్పటికే వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలోనే కీలకమైన విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఆర్థిక రాజధానిగా ఎదుగుతోందని, నాలెడ్జ్ హబ్‌గా మారుతోందని అన్నారు. పి–4 విధానం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే అనకాపల్లిలో నైపర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, విశాఖ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్‌టిఆర్ యూనివర్శిటీ విసి పి.చంద్రశేఖర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎఎంసి ఛైర్మన్ టి.రవిరాజు, ఎఎంసి ప్రిన్సిపాల్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, డాక్టర్ రవి వెంకటాచలం, డాక్టర్ బి.దేవీమాధవి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, డాక్టర్ పెద వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎయు శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

వర్సిటీ అభ్యున్నతికి కృషి చేయాలని వక్తల పిలుపు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : దేశంలోనే పేరెన్నికగన్న ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సాగర తీరంలో కాళీమాత ఆలయం వద్ద నుంచి ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్, ఎయు అధికారులు, పూర్వ ఉపకులపతులు పాల్గొన్నారు. వందలాది మంది విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది తరలివచ్చారు. వాక్‌థాన్ ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకూ కన్నుల పండువగా సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ విశిష్టతను చాటే విధంగా విద్యార్థులు నినాదాలు ఇస్తూ, ఫ్లకార్డులు పట్టుకొని ర్యాలీలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏడాది మొత్తం విభిన్న విద్య, సాంకేతిక, అవుట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే సంవత్సరం ఇదే రోజున ఘనంగా శతాబ్ది ఉత్సవ వేడుకలను నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం బీచ్ రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో మిగతా 2లో..

జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

వార్త మెయిన్‌లో..

ఆహ్వానం ఉన్నా చిన్న చూపేనా !

వార్త 2లో..

గంటా చిటపట

– ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో వాగ్వాదం

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస సమావేశం అనంతరం కారెక్కి వెళ్లిపోవడానికి సిద్ధమౌతూ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుపై భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విరుచుకుపడటం శనివారం సర్వత్రా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో మిగతా 2లో..

గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య వాగ్వాదం

మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు

‘ఉర్సా’కు కేటాయింపులను రద్దు చేయాలి : సిపిఎం

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

ఎయు శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధు మూర్తి హాజరై మాట్లాడారు. ఘనమైన వారసత్వం కలిగిన ఎయు అభ్యున్నతికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. భారతదేశానికి యువ జనాభా ఎంతో లాభదాయకమన్నారు. విద్య, పరిశోధన, ప్రజాసేవ రంగాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తనదైన శైలిలో ముందుకు వెళ్లాలని సూచించారు. విశిష్ట అతిథి ఐఐటి పాలకడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ సమగ్ర విద్యను అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రాథమిక సూత్రాలు, శాస్త్ర సంబంధ అంశాలపై బలమైన పట్టు సాధించడం ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తాను నిలవడానికిగల కారణం, సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తనకు పాఠాలు బోధించి తన ఉన్నతికి పాటుపడిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎయు పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కెవివి.రావు, ఎయు రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గంటా చిటపట

వారి మధ్య జరిగిన ఘర్షణ వైరల్‌గా మారింది. తన నియోజకవర్గంలోని రుషికొండలోగల వైజాగ్ ఫిలిం సిటీ క్లబ్ వ్యవహారంలో తన ప్రమేయం లేకుండా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు విష్ణుకుమార్ రాజు వినతిపత్రం ఇవ్వడంతో గంటాలో ఆవేశం రగిలింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హస్తం దీంట్లో ఉందని పేర్కొంటూ 'వానికి బుద్ధి లేదు' అంటూ గంటా చిటపటలాడారు. ఆరుగురు ఎంఎల్ఎలతో కలిసి కలెక్టర్‌కు వినతి ఇచ్చినప్పుడు తనకు కనీసం సమాచారం ఇవ్వాలనిపించలేదా ? అసలు ఏం జరుగుతోంది ? మిమ్మల్ని ఎవరు డైరెక్ట్ చేస్తున్నారు ? అంటూ ఆవేశానికి లోనయ్యారు. ఇలాంటి ఘటనలతో కూటమిలోని విభేదాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయని పలువురు వ్యాఖ్యానించారు.

మాక్ డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది

ప్రమాదాల నివారణపై సినర్జీస్‌లో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - గాజువాక : పరిశ్రమల్లో అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి ఎలా కాపాడుకోవాలి అనే విషయమై శనివారం దువ్వాడ విఎస్ఇజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండ్రీ డిజిఎం జి.భాగ్యరత్నం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాక్ డ్రిల్స్‌తో పరిశ్రమలలో ప్రమాదాలు జరిగే సమయంలో ఏ విధంగా కాపాడుకోవాలి అనేదే కాకుండా అన్ని శాఖల సమన్వయంతో వాటిని ఏ విధంగా అరికట్టవచ్చు అనే విషయంపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ మేనేజర్ బి.ఫణీంద్ర, పర్యావరణ భద్రత మేనేజర్ ఒమ్మి ఎల్లాజీరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్స్యకార భృతి అందజేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మత్స్యకారుల సేవలో' పథకం 2025-26 కింద విశాఖ జిల్లా నుంచి 12,138 మంది లబ్ధి పొందారని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున మొత్తం రూ.24 కోట్ల 27 లక్షలా 60 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం నుంచి నిర్వహించిన మత్స్యకార భృతి నిధుల విడుదల కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ విసి హాలు నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు, మత్స్యకారులు భాగస్వామ్యం అయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం, నిధుల విడుదల అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు మెగా చెక్కును జిల్లా కలెక్టర్ మత్స్యకార సంఘాల ప్రతినిధులు, ఇతర అధికారుల చేతుల మీదుగా అందజేశారు. మత్స్యశాఖ జెడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. అత్యంత విలువైన ఈ స్టీల్‌ప్లాంట్ దేశానికే గర్వకారణమని, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజలంతా ఐక్యంగా ఖండించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1535వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు లేకపోవడం వల్లే ఖర్చు అధికమై లాభాలు తక్కువగా వస్తున్నాయని అన్నారు. సొంతగనులు కేటాయిస్తే లాభాల బాటలో దూసుకుపోతుందని తెలిపారు. లక్షల మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఆహ్వానం ఉన్నా చిన్న చూపేనా !

ఎయు శతాబ్ది వేడుకలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని ప్రాచీన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరెన్నికగన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు ప్రదర్శించింది. 1926 ఏప్రిల్ 26న స్థాపించబడిన ఈ వర్సిటీ శతాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభంకాగా సర్కారు నుంచి ఎలాంటి సహకారమూ లభించలేదు. ప్రస్తుత వైస్ ఛాన్సలర్ జిపి.రాజశేఖర్ ఇటీవలే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు స్వయంగా ఆహ్వానం తీసుకెళ్లి ప్రతిష్టాత్మకమైన వందేళ్ల ఉత్సవానికి హాజరుకావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ప్రత్యేకంగా రావాలని కోరినట్టు సమాచారం. అయినా వారెవరూ శనివారంనాటి కార్యక్రమానికి హాజరుకాలేదు. విశాఖ బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాలులో శనివారం సాయంత్రం శతాబ్ది ఉత్సవాలకు అధికారులు శ్రీకారం చుట్టగా కార్యక్రమం చప్పగా సాగింది. మేధావులు, అభ్యుదయవాదులు, విద్యావేత్తలు, ప్రభుత్వం తరపు నుంచి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ శతాబ్ది వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, గౌరవ అతిథిగా కేరళలోని పాలకడ్ ఐఐటి డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ హాజరయ్యారు.

విశాఖకు చంద్రబాబు విచ్చేస్తున్నా సరే...

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సాయంత్రం 5 గంటలకు విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ సెంటినరీ అలుమ్ని భవన ప్రారంభ కార్యక్రమానికి విచ్చేస్తూ కూడా అదే సమయంలో జరిగే ఎయు శతాబ్ది ఉత్సవానికి హాజరుకాకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు సైతం ఎయు ఉత్సవాలకు రాకపోవడానికి కారణం ప్రభుత్వం వైపు నుంచి నిర్బంధం ఉందా ? అన్న అనుమానాలు పెద్ద ఎత్తున విశాఖలో హల్‌చల్ చేస్తున్నాయి. మూడు నెలల క్రితం విశాఖలోని గీతం యూనివర్సిటీలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తక ఆవిష్కరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బిజెపి నేతలు, ముఖ్యంగా ఇక్కడ విద్యనభ్యసించి ఉపరాష్ట్రపతిగా పనిచేసిన ఎం.వెంకయ్యనాయుడు సైతం గీతం యూనివర్సిటీలో కార్యక్రమానికి వెళ్లారు. ఎయువైపు మాత్రం వీరెవరూ కన్నెత్తి చూడకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని అంతా ఊహించినా ఆయన కూడా ఆహ్వానం ఉన్నా హాజరుకాకపోవడం చూస్తే ప్రభుత్వం ఆదేశాలున్నాయా ? అన్న సహజసిద్ధమైన అనుమానం కలుగుతోంది.

విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యం ఇవ్వరా ?

- రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

'విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం తగదు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో అశేషమైన కృషి సాగిస్తున్న ఎయు శతాబ్ది ఉత్సవాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం చూస్తే వారిది ప్రైవేట్, కార్పొరేట్ అనుకూల విద్యావిధానం బాట అన్నది స్పష్టమవుతోంది' అని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ స్పందించారు.

దళితులపై దాడిని ఖండించండి

విశాఖ కలెక్టరేట్ : పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితుల బహిష్కరణను నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం ఎల్‌విసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ: జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ సాక్షాత్తూ డిప్యూటీ సిఎం నియోజకవర్గంలోనే ఇంత ఘోరం జరగడం సిగ్గుచేటన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా కనీసం స్పందించకపోవడం పవన్ కళ్యాణ్ దళిత వ్యతిరేకతను తేటతెల్లం చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని తీసుకురావాలని కంకణం కట్టుకున్న బిజెపి ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వం వంత పాడడం శోచనీయమన్నారు. ఇటీవల వక్ఫ్‌బోర్డ్ చట్టంలో సవరణలు చేయడానికి ప్రయత్నించడాన్ని భారతదేశ ప్రజలందరూ తిరస్కరించారని గుర్తు చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టకుంటే ప్రజలు ఆందోళన బాట పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రి చంద్రశేఖర్, ఎర్రిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఎంవిపి కాలనీ: జివిఎంసి ప్రధాన కార్యాలయంలో 28వ తేదీన నిర్వహించాల్సి ఉన్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ మేయర్ పదవికి అదేరోజు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జివిఎంసి జోనల్ కార్యాలయాల్లో మాత్రం యధాతధంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

దేశ రక్షణలో ప్రైవేట్ సెక్యూరిటీ కూడా భాగమే

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రతి వ్యక్తి తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఉపాధి కల్పిస్తున్న సంస్థ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అని వైజాగ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ అసోసియేషన్ (విపిఎస్ఎస్ఎ) గౌరవాధ్యక్షులు జాలాది శ్రీనివాసరావు అన్నారు. సిరిపురంలోని ఓ హోటల్లో సెక్యూరిటీ ప్రతినిధుల వార్షిక సమావేశం నిర్వహించారు. ముందుగా ఉగ్రవాది దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో ప్రభుత్వ అధికారులతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ కూడా తమ వంతు పాత్ర పోషిస్తోందన్నారు. అధ్యక్షులు ధరిమిరెడ్డిరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మొత్తం సుమారు 500 సంస్థలు పైగా ఉన్నాయని, ఉత్తరాంధ్రలో విపిఎస్ఎస్ఎ ఒక యూనియన్‌గా ఏర్పడి ఒకరికి ఒకరు తోడుగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వం తరపున కూడా తమకు గుర్తింపు కావాలని కోరారు.

విశాఖలో ఇఎస్ఐ వైద్య కళాశాల నిర్మించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నంలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయడం హర్షించదగిన విషయమని, అదే సందర్భంలో ఇఎస్ఐ వైద్య కళాశాలను కూడా విశాఖపట్నంలోనే ఏర్పాటు చేయాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు నాయకులు కోరారు. శనివారం ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ ఢిల్లీ నుంచి వచ్చి మల్కాపురంలో ఉన్న ఇఎస్ఐ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని జ్యోతీశ్వరరావు మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక ఇఎస్ఐ ఆసుపత్రిని విశాఖ నగరంలో నిర్మిస్తున్నప్పుడు ఇఎస్ఐ మెడికల్ కళాశాలను అమరావతిలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. విశాఖపట్నం పారిశ్రామిక రాజధాని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో కార్మికులు విశాఖ నగరంలో ఉన్నారని, ఇఎస్ఐ ఆసుపత్రి లబ్ధిదారులు సంఖ్య కూడా అధికంగా ఇక్కడే ఉందని చెబుతూ ఇఎస్ఐ ఆసుపత్రిని విశాఖలో నిర్మిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇఎస్ఐ అర్హత కోసం రూ.21 వేల వేతన పరిమితిని తీసి వేయాలని కోరారు. అలా చేయటం వల్ల ఎక్కువ మంది కార్మికులకు మెరుగైన ఆరోగ్య రక్షణ లభిస్తుందన్నారు. ఇఎస్ఐ సౌకర్యాల ప్రయోజనం లభిస్తుందన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలో మెడికల్, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. తగినంతమంది సిబ్బంది, తగినంత నిధులు లేని కారణంగా ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు బయట చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులకు పూర్తిస్థాయిలో రీయింబర్స్‌మెంట్ జరగటం లేదన్నారు. ఇందువల్ల కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. బిల్లుల క్లియరెన్స్‌లో జాప్యం జరుగుతోందని, అందువల్ల రిఫరల్ ఆసుపత్రులు సరైన చికిత్సను నిరాకరిస్తున్నాయని తెలిపారు. తక్షణం ఈ విషయంలో ఇఎస్ఐ డైరెక్టర్ జోక్యం చేసుకోవాలన్నారు. ఇటీవల ఫార్మాస్యూటికల్ పరిశ్రమలలో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఫలితంగా కార్మికులు గాయపడుతున్నారని, ఇటువంటి కేసులు సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఇటువంటి రోగులకు చికిత్స చేయడానికి ఈ ప్రాంతంలో ప్రత్యేకమైన ఆసుపత్రి లేదన్నారు. చాలా సందర్భాల్లో మెరుగైన చికిత్స కోసం బాధితులను ముంబయి తరలిస్తున్నారని చెప్పారు. దీనిని గుర్తించి ఇఎస్ఐ ఆసుపత్రితో పాటు, ప్రత్యేక బరన్స్ వార్డ్‌ను అన్ని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్‌ను కలిసిన నాయకులు

వాంబే కాలనీ సమస్యలపై వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబేకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పిళ్లా వెంకటరావుకు ప్రజలు వినతిపత్రం అందించారు. వాంబే కాలనీలో నెల రోజులుగా కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు తాగు నీరు ఇస్తున్నారని, ప్రస్తుతం మూడురోజులుగా కుళాయిలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. డబ్ల్యూ బ్లాక్‌ల వద్ద కనీసం చేతి బోరు కూడా లేక వాడుక నీటికి సైతం ఇబ్బంది పడుతున్నామని వివరించారు. కొన్ని బ్లాకుల వద్ద వీధిలైట్లు లేవని తెలిపారు. యువకులు మద్యం తాగి సీసాలను దారిలో వెళ్లే వారిపై విసురుతున్నారని, చీకటిలో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని తెలిపారు. కార్పొరేటర్ స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు.

సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస కెజిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగ వంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కీర్తి శేషులు కాళ్ల గురునాయుడు జ్ఞాపకార్థం రూ.25 వేలు విలువైన మూడు సిమెంట్ బెంచీలను చిట్టివలస గ్రామ దేవత పోలమాంబ ఆలయ ఆవరణలోనూ, భీమిలి మరిడిమాంబ ఆలయ ఆవరణలోనూ ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పురుషోత్తం, రమేష్, స్థానికులు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ నరసింగరావు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు పిఎఫ్, పింఛను, గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించాలని చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రెండేళ్ల నుంచి జ్యూట్ కార్మికులకు ఎటువంటి చెల్లింపులు జరగలేదని వివరించారు. 10డి దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని కోరారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాంపైడి, కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అవంతిలో మేధో సంపత్తి దినోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం నిర్వహించారు. 'వరల్డ్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ అవేర్నెస్ ఫ్రం ఐడియా టు మార్కెట్' అంశంపై నిర్వహించిన సదస్సులో గీతం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ సముద్దీన్ మాట్లాడుతూ, పేటెంట్స్, కాపీ రైట్స్, ట్రేడ్ సీక్రెట్స్, జియో గ్రాఫికల్ ఇండికేషన్, ఇండస్ట్రియల్ డిజైన్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, విభాగాల అధిపతులు యు.రాము, రాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులను నిర్వాహకులు సన్మానించారు.

'నాగ మానసాదేవి' వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ కొండపై ఉన్న ఆదిశక్తి నాగ మానసాదేవి ఆలయంలో శనివారం తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో మొక్కలను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రసాద వితరణ చేపట్టినట్లు ధర్మకర్త కట్ట పెంటయ్య తెలిపారు. టిడిపి నాయకులు మౌర్య నరసింహ, టిడిపి నాయకులు నందవరపు సోములు, కంపర ఆనంద్ అమ్మవారిని దర్శించుకున్నారు.

శాంతిగిరి కాలనీలో వీధిలైట్లు వెయ్యాలి

వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణమూర్తి తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి శాంతిగిరి కాలనీలో వీధిలైట్లు వెయ్యాలని సిపిఎం ఆధ్వర్యాన శ్రీహరిపురంలోని ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ప్రజా చైతన్య యాత్రలో వీధి లైట్ల సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. 2019లో స్తంభం వేసి నేటికీ కనెక్షన్ కలపక పోవడం వల్ల వీధిలైట్లు వెయ్యడం లేదన్నారు. సంబంధిత ఎఇకి సిపిఎం ఆధ్వర్యాన అనేకసార్లు వినతిపత్రం ఇచ్చామని, అధికారులు పట్టించు కోలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రిపూట ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో ఒకే విద్యుత్తు స్తంభం ఉందని, దాని నుంచే అన్ని సర్వీసు వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడం వల్ల ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. వేసిన స్తంభానికి లైన్ కలిపితే వీధిలైట్లు సమస్య తీరుతుందన్నారు. అనంతరం కార్యాలయంలో విద్యుత్ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను ఎఇ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాంతిగిరి కాలనీ ఏరియా నాయకులు బూడి శ్రీను, బి.జ్యోతి, సంతోషి, కళ్యాణి, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక కోర్టును పరిశీలించిన జిల్లా ప్రధాన జడ్జి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక కోర్టు సముదాయాన్ని జిల్లా ప్రధాన జడ్జి చెన్నంశెట్టి రాజు శనివారం పరిశీలించారు. అధికారికంగా పర్యటనకు వచ్చి గాజువాక కోర్టు సముదయంలో ఉన్న భవనాల స్థితిగతులను పరిశీలించారు. అదనపు ఫ్లోర్లు కోసం నివేదిక తయారుచేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా ఒక జడ్జి జి.షణ్ముఖరావు, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి కె.కవిత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎంబి.శేషమ్మ, సీనియర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి.పల్లవి, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యశోదరావేదమని, డి.చిరంజీవి పాల్గొన్నారు.

గాజువాక కోర్టును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి చెన్నంశెట్టి రాజు

గీతంలో ముగిసిన ఆర్చరీ పోటీలు

విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

ప్రజాశక్తి-మధురవాడ : బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ భీల్ మహోత్సవ్ - ట్రైబల్ ఆర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిసాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ క్రీడలు ఆదివాసుల్లో ఉన్న ప్రతిభను జాతీయ స్థాయిలో నిలబెట్టే ఒక గొప్ప వేదిక అన్నారు. కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టిసిఆర్ఎమ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఛాంపియన్ షిప్ ఒడిశా

ఈ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటిడిఎల నుంచి సీనియర్, జూనియర్ లెవెల్లో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఒడిశా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండవ స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచింది. విజేతలకు టిసిఆర్ఎమ్ ఈడీ రాణిమందా సర్టిఫికెట్లను అందజేశారు.

'అంగన్‌వాడీ'లను పరిశీలించిన నాగాలాండ్ బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని విదేశీ నాగాలాండ్ బృందం శనివారం పరిశీలించింది. ఐసిడిఎస్ భీమిలి ప్రాజెక్ట్ పరిధిలోని ఆనందపురం గ్రామం సుపోషిత్ గ్రామ పంచాయతిగా ఎంపిక అవడంతో నాగాలాండ్ బృందం అంగన్‌వాడీ కేంద్రం సందర్శనకు వచ్చింది. గర్భిణులు - బాలింతలను టిహెచ్ఆర్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువులు తూచి పోషణట్రాకర్ యాప్‌లో సరిపోల్చారు. పోషణట్రాకర్‌లో కార్యకర్త గృహ సందర్శనల గురించి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న, పొట్టిగా ఉన్న పిల్లల ఆహార అలవాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, అన్న ప్రాసనలు నిర్వహణను పరిశీలించారు. నాగాలాండ్ నుంచి సిడిపొ చిరోత్స నౌష, సూపర్‌వైజర్ లవ్ చు, ఆర్‌జెడి జి.చిన్మయిదేవి, సిడిపిఒ ఎం.శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ శ్రీకళ, సూపర్‌వైజర్ పివివి.రత్నం, సరిత తదితరులు పాల్గొన్నారు

ఇనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ పరిధిలో రైతుల అనుభవంలో ఉన్న ఇనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సంబంధిత రైతులతో కలిసి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు తదితరులు నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకుంటూ రైతులు అనుభవిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. స్థానిక విఆర్ఒ రైతుల పట్ల చులకనగా వ్యవహరిస్తున్నారని, వెంటనే అతన్ని బదిలీ చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌తో సమావేశం ఏర్పాటుచేసి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో సింగనబంద సర్పంచ్ జివి.నారాయణ, టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, కనకల వెంకటరమణ, సంకురు భుక్తప్రకాష్, అల్లు చిన్నయ్య, కె.వెంకటరమణ, నీలాపు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

లిక్విడ్ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని దొగ్గవానిపాలెంలో శనివారం మధ్యాహ్నం రెండు కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెందుర్తి సిఐ కెవి.సతీష్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో ఎస్ఐ స్వామి నాయుడు సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా గుంటూరు జిల్లాకు చెందిన మంద మార్తమ్మ, కంప జీసస్ కుమార్ గంజాయిని తరలిస్తుండగా గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గుంటూరు నుంచి పాడేరు వచ్చి గంజాయిని సేకరించి పెందుర్తి రైల్వే స్టేషన్ మీదుగా తరలించడానికి నిందితులు ఏర్పాట్లు చేసుకోగా, పక్క సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-కొత్తకోట: ఆటో బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడని కొత్తకోట ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. టి.అర్జాపురం పంచాయతీ చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి కనకరాజు శుక్రవారం రాత్రి తన ఆటోలో అత్తవారిల్లు దొండపూడి గ్రామానికి వెళుతున్నాడు. అర్జాపురం శాస్త్రి గారి తోట సమీపంలో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన కనకరాజును హటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్సై చెప్పారు. మృతుడు కనకరాజు తండ్రి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల రెవెన్యూలో అక్రమ కట్టడాలను ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ ఆధ్వర్యాన రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. ఆనందపురం మండలం, గిడిజాల రెవెన్యూ నీలకుండీలు సర్వేనెంబర్ 332/2లో సుమారు 7.03 ఎకరాల విస్తీర్ణంలో గతంలో ఎన్‌టిఆర్ కాలనీకి 1.24 ఎకరాల భూమిని కేటాయించారు. మిగలు భూములను అనాధికారికంగా కొంతమంది ఆక్రమించి ప్రహరీ ఏర్పాటు చేశారు. అందిన సమాచారం మేరకు భీమిలి ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్ ఆధ్వర్యాన రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విఆర్ఒ దేవరాజ్, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగను అందిస్తున్న పవన్‌కుమార్ తదితరులు

చలి వేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఏక్యూజే ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన ఆనందపురం కూడలి వద్ద చలివేంద్రం ఏర్పాటుచేశారు. 30 లీటర్లు మజ్జిగను పంపిణీ చేసినట్లు ఎన్ఎస్ఎస్ పిఒ పవన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన సిబంది పాల్గొన్నారు.

బిజెపిలోకి బొడ్డేటి కాశీ విశ్వనాథం

ప్రజాశక్తి - సీతమ్మధార : విశ్వనాథ్ కన్వెన్షన్ అధినేత, రాజకీయ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సమక్షంలో శనివారం బిజెపిలో చేరారు. మురళీనగర్ హైవేలో ఉన్న బొచ్చా కన్వెన్షన్‌లో ఈ మేరకు సత్య కుమార్ యాదవ్ కాశీ విశ్వనాథంకు పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథానికి కండువా వేస్తున్నమంత్రి సత్యకుమార్‌యాదవ్

30న కర్రి వీరాస్వామి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఎఫ్ మెకానిక్ సీనియర్ ఛార్జిమ్యాన్ కర్రి వీరాస్వామి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1965 ఏప్రిల్ 10న జన్మించిన ఆయన 1979వ సంవత్సరంలో పదవ తరగతి, తర్వాత ఐటిఐలో

వీరాస్వామి దంపతులు

వెల్డర్ పూర్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పయనీర్ ఇంజినీరింగ్ కంపెనీ యార్డులో పనిచేశారు. 1987 మార్చి 9న టెక్నీషియన్‌గా స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం పొందారు. ఉద్యోగం చేస్తూ 1990 సంవత్సరంలో సిఐటియులో చేరారు. 2010, 2015 సంవత్సరాల్లో సిఐటియు ప్యానల్ తరుపున కో-ఆపరేటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వడ్లపూడి సిపిఎం సెక్రటరీగా ఉన్నారు. 2012 నుంచి 2015 వరకు స్టీల్‌ప్లాంట్ కాంటాక్ట్ లేబర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. నిర్వాసితుల సమస్యలపై పనిచేశారు. ఈయన ఉద్యోగం చేస్తుండగా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నెలరోజుల పాటు టెక్నికల్ శిక్షణ నిమిత్తం పంపడం ఉద్యోగ సర్వీసులో అరుదైన ఘట్టమని వీరాస్వామి చెప్పారు. భవిష్యత్తులో సిపిఎం కోసం పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ న్యూ హంటర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారామయ్యచౌదరి

రాయల్ ఎన్‌ఫీల్డ్
న్యూ హంటర్ బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 న్యూ హంటర్ బైక్‌ను దొండపర్తిలోని షోరూంలో సంస్థ ఎమ్‌డి జివివి.సీతారామయ్య చౌదరి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ప్రజల అభిమానంతో ముందుకు దూసుకుపోతోందని, ఇటువంటి తరుణంలో 350 న్యూ హంటర్ బైక్ లాంచ్ చేయడం చాలా సంతోషకరంగా ఉందని చెప్పారు. ఇప్పటికే బైక్ కోసం పలువురు ఆన్‌లైన్లఓ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నూతన ఫ్యూచర్స్‌తో కలిగిన బైక్‌ను ప్రజలకు అందించడంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ముందుంటుందన్నారు. తమ బ్రాంచ్‌లో బైక్‌ను కొనుగోలు చేసి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.నరేంద్ర చౌదరి, దొండపర్తి షోరూం బ్రాంచ్ మేనేజర్ జె.కళ్యాణ్‌దీపక్, సంస్థ సిబ్బంది, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు

ప్రజాశక్తి- విశాఖపట్నం : విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోటామారీ కేమేశ్వర శ్రీనివాస్, కార్యదర్శి లాలం పార్వతినాయుడు, కోశాధికారి అవుల దివేష్‌కుమార్ ఆధ్వర్యాన విశాఖపట్నం జిల్లా కోర్టు గ్రంథాలయంలో శుక్రవారం, శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో అన్ని రకాల రక్త, కంటి, బిపి, సుగర్, థైరాయిడ్, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ, న్యాయవాదుల కుటుంబాల్లో పిల్లల ఉన్నతమైన చదువుల కోసం విద్యా పరమైన అకాడమీలను ఏర్పాటుచేయుటకు తగు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యం, విద్య చాలా అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయవాద వృత్తిని గౌరవించేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ వేణి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న న్యాయవాదులు

నిత్య విద్యార్థులుగా యువ న్యాయవాదులు

ప్రజాశక్తి- లీగల్ : యువ న్యాయవాదులు నిత్యమూ నూతన పరిశోధాత్మక విద్యార్థిగా ఉన్ననాడే వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కమిటీ ఆధ్వర్యాన 'యంగ్ అడ్వకేట్స్ కన్వెన్షన్' శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడుతూ, ఒక మంచి లాయరుగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలంటే రోజూ కోర్టుల్లో జరిగే ప్రొసీడింగులను పరిశీలిస్తూ, వచ్చిన కేసుల అవకాశాన్ని బట్టి ఆయా చట్టాలపై పూర్తి నిష్టాతమైన జ్ఞానంతో కోర్టులలో వాదించ గలిగి ఉండాలని తెలిపారు. చట్టాల్లో వస్తున్న మార్పులను సీనియర్ న్యాయవాదులను అడిగి నేర్చుకోవాలని సూచించారు. న్యాయ శాస్త్రం ఒక పనిముట్టు లాంటిదని హార్వర్డ్ యూనివర్సిటీ డీన్ రస్క్ పౌండ్ తన వ్యాసాల్లో రాశారని, ఆ పనిముట్టును ఉపయోగించి సమాజ నిర్మాణానికి నిర్దేశించగలిగే వ్యక్తి న్యాయవాదని విఆర్ కృష్ణయ్య చెప్పారని గుర్తు చేశారు. న్యాయమూర్తిగా తన అనుభవంలో ఎదురైన అనేక కేసుల ఇతివృత్తాంతాలను వివరించారు.

యంగ్ అడ్వకేట్స్ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్

న్యాయవాది సోషల్ రెస్పాన్సిబిలిటీ అనే అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కేంద్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల సుప్రీంకోర్టులో తమిళనాడు గవర్నర్ తీరుపై చట్టాల అమలు కాలపరిమితిని నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై నిందిస్తున్న లోక్‌సభ డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రులు తీరును వివరించారు. ఐలు గౌరవాధ్యక్షులు బివి.రామాంజేయరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏయూ లా కాలేజీ ప్రిన్సిపల్ సీతా మాణిక్యం, ఎల్.పార్వతీనాయుడు, ఐలు జిల్లా కమిటీ అధ్యక్షులు అల్లు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ఆటలపోటీలనుద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : మేడేను పురస్కరించుకొని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్, ఐద్వా ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆటల పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. రెండో రోజు పోటీలను 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. స్పీడ్ వాకింగ్, స్లో సైకిల్, రన్నింగ్, సెవెన్ స్టెప్స్, ఇన్ అవుట్, త్రెడ్ అండ్ నీడిల్, ప్లేట్ అండ్ బ్యాంగిల్, సింగిల్ లెగ్ రేస్, బెలూన్ బ్లోయింగ్ తదితర పోటీల్లో పెద్దసంఖ్యలో పిల్లలు, పెద్దలు, యువకులు, మహిళలు, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్యాకేజీ పేర పెద్దఎత్తున కార్మికులపై దాడికి పాల్పడుతోందని విమర్శించారు. ఇప్పటికే 12వందలకు పైగా పర్మినెంట్ కార్మికులను, 2వేలమందికిపైగా కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, మరో 3వేల మందిని తొలగించటానికి సిద్ధమయ్యారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం, విశాఖ విమల విద్యాలయాలను ముసివేయటానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని, త్వరలో స్టీల్ జనరల్ ఆసుపత్రిని కూడా ప్రయివేటు పరం చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మేందుకే ఈ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ చర్యలను నిలువరించేందుకు ప్రయత్నించకుండా కేంద్రంలోని బిజెపితో కలిసి ఈ చర్యలకు మద్దతు పలకటం విశాఖ స్టీల్ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని తెలిపారు.

విశాఖ స్టీల్ రక్షణకు ఉక్కునగరంలో మేడే మార్చ్ జరుగుతుందని, దీనిలో అందరూ పాల్గోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు ఎస్‌కె.మొహిద్దిన్, ఆర్.వెంకటరావు, ప్రదీప్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, మహేష్, ఐద్వా నాయకులు వేణు, ప్రభ పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్లు రద్దుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ పోర్టు హాస్పిటల్ టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని పోర్టు సిఐటియు నాయకులు డి.ఎల్లారావు డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 208వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి యూనియన్ (సిఐటియు) పెన్షనర్లు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎల్లారావు మాట్లాడుతూ, ఎప్రిల్ 21 ఓపెన్ చేయాలన్న టెండర్ మళ్లీ 28వ తేదీకి వాయిదా వేశారని తెలిపారు. ప్రయివేటీకరణ నిర్ణయం ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ఉందని విమర్శించారు. ఈ సంవత్సరం రూ.724.4 కోట్ల లాభాలను సొంతం చేసుకున్న విశాఖపట్నం పోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.171 కోట్లు పన్నుల రూపంలో చెల్లించిందని తెలిపారు. లాభాలు ఆర్జిస్తున్నా పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకు అప్పగించాలని చూడటం సిగ్గుచేటన్నారు. కార్మిక వర్గాల హక్కులను ప్రభుత్వం హరిస్తుందన్నారు. ప్రయివేటీకరణ జరిగితే 40 వేల కుటుంబాలు వైద్య సేవలకు దూరం అవుతాయని తెలిపారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కార్మికులకు, ప్రజలకు హాస్పిటల్ సేవలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ ద్వారా ప్రయివేటు సంస్థలే లాభం పొందుతాయని, ప్రజలు, కార్మికులు మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ దీక్షలో సిఐటియు నాయకులు కెఎస్.కుమార్, రాఘవులు, కృష్ణమూర్తి, మసేను, పైడిరాజు, బి.జగన్, సూరిబాబు, నాయుడు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్న భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేయడం కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ ఎం.రమేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం జనవరి 22వ తేదీన జిఒ 27 విడుదల చేసిందని, దీని ప్రకారం అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో 150 చదరపు గజాల కంటే తక్కువ ఉన్న భూములను ఆయా లబ్ధిదారులకు ఉచితంగానే క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పారు. 150 చదరపు గజాల కంటే ఎక్కువ ఉంటే దానికి ప్రభుత్వ ధరను వసూలు చేస్తామని తెలిపారు. జిఒ 30 ప్రకారం ఎటువంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు కూడా 150 చదరపు గజాల స్థలం వరకు ఉచితంగానే క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. వీటి కోసం లబ్ధిదారులు తమ రిజిస్టర్డ్ డాక్యుమెంట్, లింక్ డాక్యుమెంట్, మున్సిపల్ పన్ను రశీదు, అధార్ కార్డు, లేటెస్ట్ ఈసి, గూగుల్ సర్వే రిపోర్ట, దీనికి సంబంధించిన మూడు దరఖాస్తులు తమ ప్రాంత విఆర్ఒలకు ఈ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీ లోగా అందజేయాలని పేర్కొన్నారు. 296 జిఒ ప్రకారం 2015-16 సంవత్సరంలో నగర పరిధిలో సుమారు 3500 మంది లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు కూడా త్వరలోనే రిజిస్ట్రేషన్లు చేస్తామని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు గ్రంథాలయాధికారి పివి.రమణ తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు శిబిరం ఉంటుందని, స్కూల్ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం, కథలు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. దీని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

కెకె.రాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కెకె.రాజుకు 54 వార్డు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సీతమ్మధారలోని కెకె.రాజు క్యాంప్ కార్యాలయానికి వచ్చి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడితి చిరంజీవి, ఎర్రబెల్లి ప్రసాద్, అచ్యుతరావు, రమణమ్మ, రమేష్, పారన్న, శ్రీనివాసరెడ్డి, శ్రీను, రాంబాబు, శంకర్, సుగుణ, చిన్ని, దంతా, సన్యాసిరావు పాల్గొన్నారు.

వేతన బకాయిలు, ఇతర సమస్యలపై

ఉపాధి హామీ కూలీల ధర్నా

ప్రజాశక్తి-వడ్డాది

ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న కూలీలకు బకాయి ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామ సచివాలయం-1 వద్ద శనివారం 300 మంది కూలీలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్‌వి నాయుడు, పినపాత్రుని సాంబశివరావు మాట్లాడుతూ వడ్డాది గ్రామంలో 12 గ్రూపులు ఉపాధి హామీ పనులు చేస్తున్నాయని, వారికి ఐదు వారాల నుంచి కూలి డబ్బులు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలు ఏడు రోజులు పని చేస్తే నాలుగు రోజులు పనికి మాత్రమే డబ్బులు పడుతున్నాయని తెలిపారు. రోజుకు 100 నుంచి 200లోపు మాత్రమే కూలి వస్తుందని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.307 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా దానిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. తెల్లవారుజామున 5 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు చేస్తున్నారని, అయినా మెజర్మెంట్ కొలత ప్రకారంగా పొడవు వెడల్పు రెండు మీటర్లు పని పూర్తయిన తర్వాతే ఇంటికి వెళ్లాలని విఆర్ఓ, ఏపీవో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. రెండు మీటర్లు వెడల్పు, పొడవు మెజర్మెంట్స్ విధానాన్ని, ఫోటో విధానాన్ని, ఎన్ఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలని, ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.307 ప్రతి కూలీకి కచ్చితంగా అమలు చేయాలని కోరారు. తక్షణమే ఈ సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు నక్క సత్యవతి, విజయలక్ష్మి, రమణమ్మ, అధిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్‌పి, పోలీసు అధికారులు

122 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

ఒడిశా బోర్డర్ నుండి అక్రమంగా తరలిస్తున్న 122 కేజీల గంజాయిని అనకాపల్లి మండలం సంపతపురం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ గెస్ట్ హౌస్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఈ వివరాలను ఎస్‌ఫి తుహిన్ సిన్హా వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం రావడంతో సంపత్ పురం జంక్షన్ వద్ద శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఆ మార్గంలో వస్తున్న బైకు, ఆటోను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుండి 122 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే 5 మొబైల్ ఫోన్లు, ఆటో, బైక్, వెయ్యి రూపాయలు నగదును సీజ్ చేశారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ 20బి సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. గంజాయి బ్యాచ్‌ను పట్టుకున్న సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణి, సిఐ అశోక్ కుమార్, ఎస్సై రవికుమార్, సిబ్బంది సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన, కంటి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఆదివారం ఉదయం 8 గంటలకు మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలను మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. అలాగే కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చి నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నుండి వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ శిబిరాలను విజయవంతం చేయాలని శనివారం ఎ.కోడూరు, సూరెడ్డిపాలెం, వారాడ, వి.సంతపాలెం, ఆర్‌వై.అగ్రహారం, కెజె.పురం సింగందొరపాలెం తదితర గ్రామాల్లో ఆటో ప్రచారం చేసినట్లు వెంకటరావు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కన్నుల పండుగగా సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా స్థానిక మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏలూరు హేమ సుందర్ శిష్య బృందం, గుంటూరు మాదా మాధవ నాట్య క్షేత్రం, షేక్ కలీల్ వారి చిన్నారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ఆళ్ల రామచంద్రరావు ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్ గొర్లి రాము, పెనుమతి అప్పారావు, దొడ్డి రాము, విజయరామరాజుపేట లక్ష్మీదేవిపేట కూటమి నాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో పాత కోర్టు భవనాన్ని ఉమ్మడి జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు శనివారం పరిశీలించారు. అనకాపల్లి కోర్టు ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న విషయం తెలిసిందే. బార్ అసోసియేషన్ న్యాయవాదుల కోరిక మేరకు అనకాపల్లికి నూతన కోర్టును నిర్మించాలనే ఉద్దేశంతో పరిశీలన చేశారు. నాలుగు రోడ్ల వద్ద ఉన్న పాతకోర్టు భవనాన్ని పనికొస్తుందా లేదా చూశారు. ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో మాట్లాడి పర్యవేక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కోర్టు భవన నిర్మాణానికి సంబంధించి సమన్వయంతో ముందుకి వెళ్లామని చెప్పారు. 10వ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ధర్మారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ రమేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, సెక్రెటరీ దుర్గారావు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సాగుకు ముందు భూసార పరీక్షలు అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : పంటలు సాగు చేసే ముందు రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ సూచించారు. దేవరాపల్లిలో రైతు కొరుపోలు రమణ పొలంలో శనివారం మట్టి నమూనాలను సేకరించారు. మట్టి నమూనాలు సేకరణ విధానంపై వ్యవసాయ శాఖ సిబ్బందికి స్పష్టంగా వివరించారు. మండల వ్యాప్తంగా 1100 మట్టి నమూనాలు సేకరించాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్, ఏపీ ప్రభుత్వం పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తల జిల్లా స్థాయి శిక్షణ తరగతులు స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగాయి. శంకరరావు, జిల్లా కోశాధికారి వీపీ శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి మాట్లాడారు. రాష్ట్రంలో అత్యంత తక్కువ జీతంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీదేవి, బీబీ, శివలక్ష్మి, జానకి, లక్ష్మి, జిల్లా వ్యాప్తంగా కార్మికులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

15 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన వైనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8 గంటల లోపు 12 గంటల వ్యవధిలో 15 మందిపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారందరికి దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ర్యాబిస్ వ్యాక్సిన్ చేశారు. శనివారం ఉదయం బండారు వీధిలో కొళాయి నీళ్ల పడుతున్న బండారు దీపిక (పదవ తరగతి)పై దాడి చేసి ఎడమ కాలుపై నుంచి కింద వరకు అనేక చోట గాయపర్చింది. కుక్క నుంచి ఆమెను స్థానికులు అతి కష్టం మీద కాపాడారు. మరిడిమాంబ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు జాగరపు ఉదయ్ కుమార్ పొట్ట, కాలు, చెవులపై అతి దారుణంగా దాడి చేసింది. ఆ బాలుడు కేకలు వేయడంతో తల్లిదండ్రులు కుక్క నుంచి తమ కుమారుడ్ని కాపాడుకోగలిగారు. శంభువానిపాలెం నుంచి ఉపాధి పనులకు వెళుతున్న ఉగ్గిన గాంధీని, నిద్ర లేచి మంచం మీద కూర్చున్న ఇర్రా దేముడ్ని, వడ్రంగి పనికి వెళుతున్న బల్లంకి వెంకటరావు కుక్క కాటుకు గురయ్యారు. పాతరపల్లి కోటి, కొత్తూరు మహేష్, జి అవినాష్, ఎస్‌కె.అబ్దుల్ కలాం, ఎం శ్యామ్, ఎస్.నారాయణమూర్తి, యు.నిహారిక, వి.సౌజన్య, రైవాడకు చెందిన ఎం.కృష్ణారావు సహా మరో వ్యక్తిపై పిచ్చి కుక్క దాడి చేసి గాయపర్చింది. తీవ్రంగా గాయపడిన వారందరికీ మెరుగైన చికిత్స అందించామని దేవరాపల్లి ప్రభుత్వ వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. వారెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము చెప్పిన తేదీల్లో మిగతా ఇంజక్షన్లు తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. 12 గంటల వ్యవధిలోనే ఇంత మందిపై దాడి చేసిన కుక్క మరెంత మంది మీద దాడి చేస్తుందోనని భయంతో దేవరాపల్లి ప్రజలు వణికిపోతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా తిరుగున్న కుక్కల్ని నిరోధించే చర్యల్ని పంచాయతీ పాలక వర్గం వెంటనే చేపట్టి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రజల కోరుతున్నారు.

పిచ్చి కుక్క దాడిలో గాయపడిన బాధితులు

జాబ్ మేళాలో 285 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-చోడవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన చోడవరం గవర్నమెంట్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 285 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ మేళాను శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ మధ్యాహ్నం పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అదికారి గోవిందరావు ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాకు సుమారుగా 23 బహళ జాతీయ కంపెనీలు హాజరయ్యాయి. 945 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 285 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. సుమారు 100 మందికి ఎమ్మెల్యే రాజు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు.

మే 19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి- అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు మే 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మే 26 నుంచి 30 వరకు జరుగుతాయని, పరీక్షలకు హాజరు కాదలచిన అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 30వ తేదీ లోగా ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అపరాధ రుసుముతో మే 4లోగా, తత్కాల్ కేటగిరి ప్రత్యేక రుసుముతో మే 5వలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చున్నారు. జవాబుపత్రాల రీ వెరిఫికేషన్, దాని కాపీలు పొందుటకు వెయ్యి రూపాయల రుసుముతో మే నెల 5వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తి సమాచారానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉన్న ఓపెన్‌స్కూల్ విభాగం లేదా ఏఐ సెంటర్ల ప్రతినిధులను సంప్రదించవచ్చని తెలియజేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సిఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని కొండకర్ల బార్డ్ జంక్షన్‌లో శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులను విచారించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వ్యక్తుల వివరాలు తెలుసుకునే రికార్డులు పరిశీలించి విడిచిపెట్టారు. హోటల్స్ లాడ్జిలు వంటి ప్రాంతాల్లోనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరించినట్లు తెలిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు.

కశింకోట : తీవ్రవాదుల దాడుల నేపథ్యంలో కశింకోట మండలం, తాళ్లపాలెం జంక్షన్, అచ్చర్ల జంక్షన్ వద్ద కశింకోట సిఐ అల్లు స్వామినాయడు, ఎస్సై లక్ష్మణ్‌రావు సిబ్బందితో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానస్పద వాహనాల గురించి, వాహనాల ద్వారా అనుమానస్పదంగా ఏమైనా రవాణా చేస్తున్నారో లేదో అని పరిశీలించారు.

కోటవురట్ల : ఉగ్రమూకల దాడి నేపథ్యంలో శనివారం పాములవాక పట్టాలమ్మ తల్లి గుడి వద్ద, పొందూరు, గొటువాడ, ఎండపల్లి తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రమేష్, ఏఎస్ఐ గంగరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని కాగిత టోల్గేట్ వద్ద సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానితులు, రికార్డులు సక్రమంగా లేని వారిని గుర్తించి విచారణ చేపట్టారు. లైసెన్స్ లేని, హెల్మెట్ ధరించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

ఐద్వా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- పరవాడ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో శనివారం జెఎన్ఎన్యుఆర్ఎం కాలనీ బసవతారక రామ్‌నగర్ పాత బ్లాక్లో మహిళలతో ఐద్వా కమిటీ శనివారం ఎన్నికైంది. కమిటీ అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, కార్యదర్శిగా మాధురి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ కమిటీ ద్వారా స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయని, గ్యాస్ సిలిండర్లు, బంగారం, సెల్‌ఫోన్లు, దుస్తులు ఏవి దొరికితే అవి ప్రతిరోజు చోరీకి గురవుతున్నాయని పక్కనే పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తను తొలగించాలని, సరిపడా తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, లావణ్య, గాయత్రి, మాధురి, సీతామాలక్ష్మి, రాజరాజేశ్వరి, ముని , ఎం సంతు పాల్గొన్నారు

మత్స్యకారులకు వేట నిషేధ భృతి విడుదలపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : గంగ పుత్రులకు వేట నిషేధి కాలపు భృతిని ప్రభుత్వం విడుదల చేయడంపై మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారులు ఖాతాలో నేరుగా రూ.20వేలు చొప్పున జమ చేయడం జరుగుతుందని చెప్పారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కమ్మూస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలం పూర్తయ్యే వరకు శిబిరంలో ప్రతిరోజూ ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో రికార్డు స్థాయిలో 593 మార్కులు సాధించిన విద్యార్థిని ఉమ్మనేని గఘనశ్రీని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కాకర్ల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొల్లి శ్రీనివాసరావు గౌరవ అధ్యక్షులు రాఘవరావు, కోశాధికారి ధనాల వెంగళరావు, నాయకులు పర్వతిని శ్రీనివాస్, గొల్ల రాఘవులనాయుడు, గొడుగులూరు మోహన్ బాబు, గొట్టిపాటి సుధాకర్, పర్వతిని సూరిబాబు, గంటా ప్రసాద్, హనుమంతరావు, ఓరుగంటి కాంతారావు, పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్ల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట: కశింకోట విద్యుత్ ఆర్డిఎస్ఎస్ పనులు ఏపీ ఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ శనివారం పరిశీలించారు. కశింకోట డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. మునగపాక మండలంలో ఆర్డిఎస్ఎస్ స్కీం ద్వారా మంజూరైన అదనపు బ్రేకర్లను లైన్లు పరిశీలించారు. కశింకోట డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్‌తో కశింకోట డివిజన్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్, ప్రాజెక్ట్ , ఎపిపిడిసిఎల్ , రెస్కో ప్రాజెక్ట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని నిరసన

ప్రజాశక్తి-మునగపాక : జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని స్థానిక బైపాస్ జంక్షన్‌లో నివాసముంటున్న పలువురు శనివారం నిరసనకు దిగారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న సెల్ టవర్ నివాసాల మధ్య ఉండటమే కాకుండా జిల్లా పరిషత్ పాఠశాలకు ఆనుకుని నిర్మాణం చేపట్టడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పొలిమేర గంగరాజు, మల్ల ముసలినాయుడు, ఆడారి జోగిశ్రీనివాసరావు, టెక్కలి కిషోర్, ఆడారి హేమంత్ సాయి, ప్రసాద్, సోమనాయుడు పాల్గొన్నారు.

ఎండ వేడికి నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : భానుడి భగభగతో వాహనదారులు తమ ప్రయాణాలను సైతం వాయిదా వేసుకుంటున్నారు. మండలంలో రోడ్లు ఉదయం 10 గంటలు దాటితే నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కసింకోట బంగారమెట్ట రోడ్డు కూడా నిర్మానుష్యంగా మారింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై

డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల సిపిఎం నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, కె.ఈశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లను రఘురామకృష్ణంరాజు కూల్చివేశారని, దీన్ని ఖండించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. నిరాశ్రయులైన ప్రజల పక్షాన నిలబడి వారికి న్యాయం చేయాలని పోరాడుతున్న శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రఘురామకృష్ణంరాజును వెంటనే ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలను హింసించే రఘురామకృష్ణంరాజుకు పేద ప్రజల కోసం ప్రాణలర్పిస్తున్న సిపిఎం నేతలను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. రూ.600 కోట్లు బ్యాంకుల సొమ్మును ఎగ్గొట్టిన దొంగ రఘురామకృష్ణంరాజు అని, పదవుల కోసం రోజుకో కండువా కప్పుకునే ఆయనకు సిపిఎం నేతలను విమర్శించే అర్హత లేదని పేర్కొన్నారు. శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార మదంతో సిపిఎం జోలికొస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు.

సమావేశంలో పాల్గొన్న శ్రీరామ్, రాజు, ఈశ్వరరావు

రాజులు రాజ్యాలు ఎప్పుడో కూలిపోయాయని, ఆ భ్రమలో బతుకుతున్న రఘురామకృష్ణంరాజుని ప్రజలే తరిమికొడతారని స్పష్టం చేశారు.

ఆదివాసీ గ్రామాల ఖాళీ ప్రయత్నాలపై ప్రతిఘటన

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న పిలుపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం వల్ల ఆదివాసీల హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, ఈ ప్లాంట్ల కోసం దేవరాపల్లి మండలం చింతలపూడి, వేపాడ మండలం మారిక గ్రామాలను ఖాళీ చేయించే పనిలో అదాని మనుషులు ఉన్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్యలను ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ఏజెన్సీలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అల్లూరి జిల్లాలోని యర్రవరం ప్రాజెక్టుకు 735.63 ఎకరాలు, గుజ్జిలికి 673.13 ఎకరాలు, పెదకోటకు 499.44 ఎకరాలు, చిట్టంపాడుకు 500 ఎకరాలు, అనకాపల్లి జిల్లా చింతలపూడి, విజయనగరం జిల్లా మారిక ప్రాజెక్టుకు 650 ఎకారాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో కురుకుట్టికి 422.99 ఎకరాలు, కర్రివలస ప్రాజెక్టుకు 377.99 ఎకరాలు భూ సేకరణకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. దీని వల్ల సుమారు పది వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూమికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని, ఆదివాసీల ఆ ప్రాంతాల నుండి గెంటివేయబడతారని అందోళన వ్యక్తం చేశారు. మరో వైపు ఈ ప్రాజెక్టుల దిగువన ఉన్న కోణం, రైవాడతో పాటు పలు జలాశయాలు ఒట్టిపోయే ప్రమాదం ఉందని, వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. తాజాగా అదాని గ్రూపు వారు చింతలపూడి, మారిక గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నం ముమ్మరం చేశారని తెలిపారు. దీనిపై రైవాడ ఆయకట్టు రైతులు, గిరిజనులు పోరాటాలకు సిద్ధం కావాలని, అదాని సంస్థను తరిమి కొట్టాలని వెంకన్న పిలుపునిచ్చారు.

తాగునీరు, విద్యుత్ సరఫరా చేయాలి

మండల పరిషత్తు సమావేశంలో పాల్గొన్న ఎంపిపి కలగా లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-కశింకోట : గ్రామాల్లో తాగునీరు, విద్యుత్తు సరఫరాలో జాప్యం లేకుండా చూడాలని ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల కోసం ఉపయోగించిన ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలు అందేలా చూడాలన్నారు. బుచ్చయ్యపేట సర్పంచ్ కొన నాయుడు మాట్లాడుతూ గ్రామంలో సక్రమంగా విద్యుత్ సరఫరా ఉండడం లేదని తెలిపారు. దీనికి స్పందించిన తాళ్ళపాలెం సెక్షన్ ఏఈ నాయుడు మొయిన్‌లైన్ పక్కన రైల్వేలైన్ ఉండడం వల్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. జె.తుని ఎంపీటీసీ దర్గా మాట్లాడుతూ హైస్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అప్పుడప్పుడు షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు వస్తున్నాయని సరిచేయాలని కోరారు. పశువైద్యాధికారి ఆల్ఫాన్స్ జార్జ్ మాట్లాడుతూ పశువులకు అవసరం ఆయన నీటికుంటలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు మాట్లాడుతూ మండలంలో చెరువులకు వర్షం నీరు వచ్చే కాలువల్లో పూడిక తీయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనువాసరావు, నమ్మి మీనా గణేష్, ఎంపీడీఓ రవి కుమార్, సీడీపీఓ ప్రభావతి, ఎంఇఓలు సురేష్ కుమార్, సూర్య నారాయణమూర్తి, ఎఈ వెలగా శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి ఎం.స్వప్న, సర్పంచ్‌లు కొన అరుణ నాగేశ్వరరావు, నిమ్మదల సోమేశ్వరరావు, శ్యాంసన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు బత్తి వెంకటరమణ, బండారు అక్కన్నపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీ అధ్యక్షునిగా కన్నూరు సూర్యనారాయణ, కార్యదర్శిగా జోగ దేముడు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారందరినీ గ్రామస్తులు సత్కరించారు.

కశింకోట : కసింకోట మండలంలోని ఏనుగు తుని, ఏఎస్ పేట, టీ సోమవరం, ఎన్జీపురం గ్రామాల్లో టిడిపి గ్రామ, బూతు కమిటీల ఎన్నికలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతెన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాయల మురళి, నాయకులు వేగి గోపికృష్ణ, సింగ్, రమణ మూర్తి, ఉల్లింగల రమేష్, నైనాంశెట్టి రమణరావు, కలగా సోమేశ్వరరావు, కర్రి దుర్గ నాయుడు, జెర్రిపోతులు నూకి నాయుడు పాల్గొన్నారు.

సాగు విధానంపై శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అనకాపల్లి వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రొగ్రాం శనివారం నిర్వహించారు. సాగులో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడి రామారావు, డిఆర్‌సి. ఎడి శ్రీధర్, ఎడి సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి స్వప్న పాల్గొన్నారు.

మైనారిటీల స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నివసించే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులకు స్వయం ఉపాధి పథకం కింద ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షామ్ సున్నీసా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ముస్లిములకు రూ.లక్ష నుండి 8 లక్షల వరకు, క్రైస్తవలకు రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు 50 శాతం సబ్సిడీపై మంజూరు చేస్తామని తెలిపారు. అర్హత కలిగిన వ్యక్తులు తమ వివరాలను https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా మే నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర పౌరుడై ఉండాలని, గత 5 సంవత్సరాలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి రాయితీలు సబ్సిడీలు పొందకూడదని,21 నుండి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు పట్టణ ప్రాంతాలవారు రూ.2లక్షలు సంవత్సరానికి కలిగి ఉండాలని సూచించారు. ముస్లిములకు బిసిఈ, క్రైస్తవులకు బిసిసి సర్టిఫికేట్ తహశీల్దారు జారీ చేసినవి ఉండాలని కోరారు. లేదా పదోతరగతి టిసిలో ఇండియన్ క్రిస్టియన్ పేరుతో ఉన్న ధ్రువపత్రం. ఇతర మైనారిటీ/క్రైస్తవ వారు ఓసి సర్టిఫికెట్, క్రైస్తవులకు బాప్టిజం సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. ఆధార్ కార్డు జిరాక్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం మొదటి పేజీ కాపీ (ఫోటోతో సహా), నివాస ధ్రువపత్రం, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు ఉండాలని కోరారు. ఇతర వివరాలకు మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను ఫోన్ 0891-2502271/ 98499 01159, 9441716209, 9100245438 ద్వారా గాని, డాక్టర్ దీన్ షాదీఖాన్, పాత పోస్ట్ ఆఫీసు, విశాఖపట్నం కార్యాలయంలోని సంప్రదించవచ్చని తెలిపారు.

బి.కింతాడలో శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో డిఎల్‌డిఒ, మండల ప్రత్యేక అధికారి మంజులవాణి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో మండల స్థాయి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వీధులను, సైడ్ కాలవలను పరిశీలించారు. గ్రామంలో సైడ్ కాలవల్లో మురుగు పేరుకుపోవడాన్ని గమనించి, వెంటనే పూడికతీత పనులను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సర్పంచ్ బూరె బాబురావు, గ్రామ పెద్దలతో గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ తేజ, ఇన్‌చార్జి ఈఒపిఆర్డి జామి అప్పారావు, ఇతర అధికారులు

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం : టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి ఫిర్యాదులను విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు గండిబాబ్జి స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, చెప్పారు.

నేడు నూకాలమ్మ నెల పండగ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలో అసకపల్లి పంచాయితీ, ఎరుకునాయుడుపాలెం శివారు కర్రివానిపాలెంలో ఈ నెల 27న ఆదివారం నూకాలమ్మ అమ్మవారి నెల పండగ నిర్వహించనున్నారు. అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదానం, సాయంత్రం 4 గంటల నుండి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు సాంఘిక నాటకం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్న శంకుస్థాపన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం వేములపూడి కేజీబీవీలో రూ.164.02 లక్షలతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఏకంగా ఏడాది కాలంలో రూ. 90 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున నిధులు అందితే, నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేములపూడి పీహెచ్‌లో కూడా పడకల సంఖ్య పెంచేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాతవరంలో శంకుస్థాపన చేస్తున్న అయ్యన్న

వేములపూడిలో రోడ్డు విస్తరణకు స్థానికులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కపల్లి నూకాలమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, స్థానిక నాయకులు బోశెం రాంప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, జడ్పీటీసీ సుకల రమణమ్మ, ఆర్డీవో వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం:మండలంలోని మర్రిపాలెం కేజీబీవీ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాల నిర్మాణానికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంకృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎల్ఐసి బీమా ప్రతినిధి

ఆలయ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల గాంధీ పార్క్ వద్ద ఉన్న విజయ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి పనులు శనివారం ప్రారంభమయ్యాయి. సుమారు 5 లక్షలతో భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం, గోపురం నిర్మాణం పనులకు శనివారం స్థానిక ఎల్ఐసి బీమా ప్రతినిధి పాలకుర్తి సురేష్ కుమార్ భూమి పూజ నిర్వహించారు. గోపురంతో పాటు ఆలయానికి ఆర్చి నిర్మాణం కూడా చేపట్టాలని నిర్ణయించారు. దాతలు సహకారాన్ని అందించాలని ఆలయ నిర్వాహకులు నాగోజి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, పుట్టా నానాజీ, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చు కోవాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద క్యాంపస్ రిక్రూట్‌మెంట్ గేమ్ ప్లాన్‌లో భాగంగా పరిశ్రమ నాయకులు, హ్యూమన్ రిసోర్స్ నిపుణులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 సంవత్సరాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ విద్యను అందించాలనే ఉద్దేశంతో కళాశాల ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మట్టిలో లభించే మాణిక్యం వంటి వారని కొనియాడారు. అనంతరం నాగవీర్ ఉండవల్లి మాట్లాడుతూ, అకాడమిక్ మంచి ఉత్తీర్ణత సాధించి నప్పటికీ అవసరమైన నైపుణ్యాన్ని మెరుగు పరుచుకున్నప్పుడే విజయం సాధించగలుగుతామన్నారు, కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కమ్యూనికేషన్ స్కిల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ, ఐటిరంగం వేగంగా మారుతుందని విద్యార్థులు నైపుణ్య అంశాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు, అనంతరం విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌రావు అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరావు

మాట్లాడుతున్న అవంతి శ్రీనివాసరావు

ఉగ్రవాదుల దాడులపై నిరసనలు

రావికమతంలో నిరసన చేపడుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-గాజువాక : కశ్మీర్ పెహల్‌గాంలో టూరిస్టులపై ముష్కర్లు చేసిన దాడిని నిరసిస్తూ వార్వా నివాస్ ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్లో శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్వా, నివాస్ గాజువాక జోన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కార్యదర్శి కె.కిరీటం, బంగారునాయుడు, కె.రమణ, వాయిస్ ఆఫ్ గాజువాక ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి విశ్వనాధ రావు, కె.నూకరాజు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ముడసర్లోవ వాకర్స్ సభ్యులు, ముస్లిం సంఘాల నాయకులు, స్థానిక యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. అనంతరం ముడసర్లోవ స్కిల్ డవలెప్‌మెంట్ నుంచి బిఆర్‌టిఎస్ రోడ్డు సర్వీసు రోడ్డు గుండా చినగదిలి సాయిబాబా మందిరం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. బిఆర్‌టిఎస్ రహదారి వద్ద మానవ హారం నిర్వహించి సంతాపం తెలిపారు. సేవాస్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యాన రవీంద్రనగర్ బస్‌స్టాపు నుంచి డైరీఫారం కూడలి వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీలకతీతంగా స్థానికులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాస్ఫూర్తి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

రావికమతం:పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో మాడుగుల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా రావికమతం మండలం మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కంచిపాటి జగన్నాధరావు మాట్లాడుతూ, ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తహసిల్దార్ బి. వెంకటరమణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముక్క మహాలక్ష్మి నాయుడు, సర్పంచ్ గెంజి మోది నాయుడు ,ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, శ్రీను, సూర్యనారాయణ, రావికమతం మండల మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కంచిపాటి జగన్నాథరావు, మండల తహశీల్దార్ బి వెంకటరమణ, ఆర్ఐ సతీష్, ఎస్సై రఘువర్మ, మండల పరిషత్ ఏవో స్వామి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగులు..

అనకాపల్లి రూరల్ : ఉగ్రదాడులకు నిరసనగా అనకాపల్లి యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాంద్రేగుల హరికృష్ణ, బ్యాంకు మేనేజర్ దాసరి రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉగ్రదాడిని ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణ పాత్రికేయులు, అధికారులు ప్లకార్డులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈఓలు కే సత్యనారాయణ, డివిడి ప్రసాద్, వెలుగు ఏపిఎం కే.చినబాబు పాత్రికేయులు నేమాల సతీష్, కుబిరెడ్డి రాధాకృష్ణ గజ్జి గంగాధర్, నంబారు అప్పారావు, శరగడం పరమేష్, గజ్జి రమేష్ కుమార్, నీలి శ్రీను పాల్గొన్నారు.

పాత్రికేయులు, వాకర్స్...

అనకాపల్లి : అనకాపల్లి ప్రెస్‌క్లబ్ (ఏపీడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం మహాత్మా గాంధీ విగ్రహానికి అనకాపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మళ్ళ భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, చాగంటి సర్వారావు, మద్దాల రాంబాబు, మల్ల భాస్కర్‌రావు, శిలపరశెట్టి ప్రసాద్, భానోజీరావు, యల్లపు రమణాజీ పాల్గొన్నారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్, మార్కెట్ యార్డ్ వాకర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ, సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ, డాక్టర్ డిడి నాయుడు, కాండ్రేగుల గంగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులపై సిఐటియు నిరసన

చోడవరం : ఉగ్రవాదుల దాడులకు నిరసనగా శనివారం సిఐటియూ, ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో చోడవరం కొత్తూరు జంక్షన్‌లో కొవొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, అప్పారావు, వై.లోవరాజు నాగిరెడ్డి సత్యనారాయణ, చంద్రశేఖర్, కళ్యాణ్, శ్రీను పాల్గొన్నారు.

చోడవరంలో కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న నేతలు

శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

వంతెన పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో పండురు వరాహ నదిపై అసంపూర్తిగా నిలిచిన వంతెనకు హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందులో భాగంగా 5.75 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం బుజ్జి, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, టిడిపి నాయకులు జానకి శ్రీను, జనసేన నాయకులు సంఘంపల్లి శ్రీనివాస్, పొందూరు సర్పంచ్ జగదీష్, తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలంలో చీమలపాడు పంచాయతీ జెడ్.జోగుంపేట గిరిజన గ్రామంలో శనివారం కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 55మంది కి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చునని వైద్యాధికారి మోహిని సురేఖ అన్నారు. దోమకాటుతో మలేరియా వ్యాధి వస్తుందని, ఈ దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమతెరలు వాడాలని చెప్పారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యపరీక్షలు చేయిం చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్, నిర్వాహకులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వేసవి కాలం దృష్ట్యా నర్సీపట్నం శ్రీవిద్యాంజలి హైస్కూల్ సౌజన్యంతో నర్సీపట్నం ఆర్టీసి కాంప్లెక్స్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని డిపో మేనేజర్ ఎంఎస్ఎస్.ధీరజ్ ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో ప్రయాణికులు దాహార్తి తీరడానికి ఈ చలివేంద్రం దోహదపడుతుందన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- మాడుగుల:ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తహసిల్దార్ కే.రమాదేవి తెలిపారు. ప్రతి శనివారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అందిన అర్జీల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఫిర్యాదుదారులకు తగిన న్యాయం చేసేందుకే అధికారులతో కూడిన కమిటీ సభ్యులతో కలిసి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు

-నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సుందరకోటలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు జరుగుతున్నాయని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ లేటరైట్ దోపిడి వెనుక స్పీకర్ అయ్యన్నపాత్రుడు హస్తం ఉందో లేదో చెప్పాలన్నారు. ఈ ప్రాంతంలో లేటరైట్ పేరుతో కొన్ని వందల కోట్ల బాక్సైట్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దీనికి నర్సీపట్నం ప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ హోటల్ యాజమాని పాత్ర కీలకంగా ఉందన్నారు. దీనికి రాజమండ్రిలోని ఓ కంపెనీతో వందల కోట్లు బేరం కుదుర్చుకోవడమే కాకుండా ఆయన హోటల్‌లో ఆ ప్రాంత పెద్దలను పిలిపించి మాట్లాడటం జరిగిందన్నారు. 2022లో స్పీకర్ అయ్యన్న అక్రమ మైనింగ్‌పై పోరాటం అని పెద్ద ఎత్తున ఉద్యమం చేశారని, వందల వేలకోట్లు దోచేస్తున్నారని పెద్ద ఉద్యమం చేశారని, ఇప్పుడు నర్సీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న బాక్సైట్ దోపిడిపై మీ హస్తం ఉందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

అవార్డును అందుకుంటున్న నాగభూషణం

నాగభూషణంకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో న్యాయంపూడి గ్రామపంచాయతీ సమృద్ధి నీటి సరఫరా విభాగంలో ఎంపిక కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణంకు అవార్డు వరించింది. విజయవాడలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని ఆర్ డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం అందుకున్నారు. న్యాయంపూడి గ్రామంలో ప్రజలకు సమృద్ధిగా నీటిని సరఫరా చేయడంతో గుర్తించారన్నారు.

ఆలయానికి తలుపుల వితరణ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి క్షేత్రంలో ఆలయ గర్భగుడికి యలమంచిలికి చెందిన త్రిపరాల రాము టేకు చెక్కలతో తయారు చేసిన తలుపులు అందజేశారు. శనివారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు సమక్షంలో ఆలయ గర్భగుడికి ఈ డోర్లను ఏర్పాటు చేశారు. దాత రాము సుమారుగా రూ.30వేలు విలువైన డోరులు ఆలయానికి అందజేయడంతో ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు, పలువురు పెద్దలు అభినందనలు తెలియజేశారు.

జూన్ 3న మాడుగుల మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవం జూన్ 3వ తేదీ నిర్వహించేందుకు సంబంధించి ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు సభ్యులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది జూన్ 3వ తేదీన మోదకొండమ్మ అమ్మవారి జాతరకు సంబంధించి తేదీని ఖరారు చేశారు. అమ్మవారి జాతరకు సంబంధించి ఘనంగా పండుగ నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు భక్తులు తరలి రావాలని ఆయన కోరారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి

- హోం మంత్రి వంగలపూడి అనిత - వేట నిషేధ భృతి చెక్కుల అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి: మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన మత్స్యకార సేవ కార్యక్రమంలో భాగంగా వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు వేటనిషేధ భృతి 20 వేలు ఇచ్చామన్నారు. ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్, స్టీల్ ప్లాంట్ రాబోతున్నాయని, స్థానికులకు శిక్షణ ఇచ్చి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్‌ను కోరడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో స్థానికులకు శిక్షణ ఇచ్చి, రాబోయే కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు రెసిడెన్సియల్ స్కూలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడ్డురోడ్డులో మత్స్యకార మహిళలు చేపలు అమ్మడానికి వీలుగా 5 లక్షల నిధులతో షెడ్ నిర్మాణం చేపడతామని తెలిపారు.జిల్లా కలెక్టర్‌తో కలిసి మత్స్యకారులకు వేట నిషేధ భృతి చెక్కులు అందజేశారు. అనకాపల్లి జిల్లాలో 12,644 మంది లబ్ధిదారులకు 25 కోట్ల 28 లక్షల,80 వేలు, దీంట్లో పాయకరావుపేట నియోజకవర్గం సంబంధించి 7600 మంది లబ్ధిదారులకుగాను 14 కోట్ల 64 లక్షల, 80 వేల చెక్కులను పంపిణీ చేశారు. దీనికి ముందుగా మత్స్యకార నాయకులు వంకా రమణ, గోసల చిన తాతారావు, కాశీ విశ్వనాథం, ఎం.రాంబాబు, గరికిన సింహాద్రి, మెరుగు నాగేశ్వరరావు, అడవి రాజు మాట్లాడారు. తీర ప్రాంతాల్లో పరిశ్రమలు రాబోతున్నాయని, పొల్యూషన్ రాకుండా అరికట్టాలని, మత్స్యకారులకు ప్యాకేజీ ఇచ్చి, అన్ని విధాలా ఆదుకోవాలని, గురుకుల పాఠశాల మంజూరు చేయాలని కోరారు.50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు ఫించన్ మంజూరు చేయాలని, వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందితే, వెంటనే క్లైమ్ అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి ప్రసాద్, ఏడి జాస్మిన్, డిఆర్ డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, ఎంపీడీవో సీతారామరాజు, తహసిల్దార్ నరసింహామూర్తి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, చిట్టిబాబు, అబద్దం, జానకి శ్రీను, లాలం కాశీనాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, నూకరాజు, లక్ష్మణరావు, శ్రీకాంత్, పాకలపాటి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి వారపు సంత పరిశీలన

నక్కపల్లి: నక్కపల్లి వారపు సంతలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న పాకలు ఈనెల 2న జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ మేరకు శనివారం హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వారపు సంతను సందర్శించి దగ్ధమైన పాకలను పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వారపు సంత ఆశీలు హక్కుదారులు దేవవరపు కొండలరావు, కొప్పిశెట్టి కొండబాబు తదితరులు సమస్యను హోం మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాకలు కాలిపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిరు వ్యాపారాలకు పక్కా సదుపాయాలు కల్పించాలని కోరారు. సంతలో షెడ్డులు, రోడ్లు నిర్మాణం, ఇతర సదుపాయాలు కల్పించేందుకు గాను అంచనా వేయాలని పంచాయతీరాజ్ జె ఈ, ఎంపీడీవో సీతారామరాజుకు హోం మంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరసింహమూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, నాయకులు మీగడ సత్తిబాబు, గింజాల లక్ష్మణరావు, తోలేటి శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు

ప్రజాశక్తి- మాడుగుల: తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థా గత ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ కార్యకర్తల మధ్య ఎటువంటి మనస్పర్థలకు తావు లేకుండా ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నికయ్యే విధంగా నాయకులు, కార్యకర్తలు సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం మాడుగుల వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ కమిటీ ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. మండలంలో ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు మాట్లాడుతూ, ఈనెల 28 నుంచి మే 6వ తేదీ వరకు మాడుగుల మండలంలో 29 పంచాయతీల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించేందుకు తగు కార్యాచరణ రూపొందించడానికి కార్యకర్తలు అందరూ సహకరించాలన్నారు. గ్రామ కమిటీ ఎన్నిక అనంతరం మండల కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, ఎంపీటీసీ బి శ్రీనివాస్, మాడుగుల పట్టణ పార్టీ అధ్యక్షుడు రంజిత్ వర్మ, ఎం ఈశ్వరరావు, కే త్రినాధరావు, జి.అప్పారావు, ఎల్.కాశీబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ అప్పలరాజు

డ్రైయినేజీ పనుల పరిశీలన

పరిశీలిస్తున్న కౌన్సిలర్ పద్మావతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న డ్రైనేజ్ కాలువకు 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రత్యేక చొరవతో రూ.26 లక్షల నిధులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించారు. ఇటీవల కాలంలో ఈ కాలువ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. శనివారం కౌన్సిలర్ పద్మావతి ఈ పనులను స్వయంగా పరిశీలించారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, వార్డు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసన్న

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసన్న డిమాండ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మిడ్డేమీల్ (మధ్యాహ్న భోజన)కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మిడ్డేమీల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే.ప్రసన్న డిమాండ్ చేశారు. శనివారం నర్సీపట్నం సివిటియూ కార్యాలయంలో మిడ్డేమీల్ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ మిడ్డేమీల్ కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ పంపిణీ చేయాలని, కార్మికులకు ఐడీ కార్డులు, యూనిఫాం, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మిడ్డేమీల్‌ను రాజకీయాలకు ముడిపెట్టి అనేక చోట్ల తొలగింపులకు, వేదింపులకు పాల్పడుతున్నారని, ఇటువంటి చర్యలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, లక్ష్మీ, జగద, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో అనర్థాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు వారపు సంతలో గంజాయితో కలిగే అనర్థాలపై ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మన్ కిల్లో అప్పలస్వామి మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలు సేవించరాదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్ కార్యాచరణాన్ని రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో చదువుకున్న యువత ఉన్నారని, చెడు దారులకు వెళ్లకుండా తమ జీవితాలకు మంచి మార్గాలను ఎంచుకోవాలన్నారు.